పెన్షన్.. టెన్షన్

- చంద్రబాబు కుట్రల వల్లే ఈ పరిస్థితి అంటూ పింఛన్‌దారుల మండిపాటు
- గడప దాటి రాలేకపోతున్నామని అవ్వాతాతల ఆవేదన



ఆరిలోవ 7వ నంబరు సచివాలయంలో పింఛను అందజేస్తున్న సచివాయం సిబ్బంది

ఆరిలోవ: ప్రతి నెలా ఠంచన్‌గా ఒకటో తేదీన ఇంటి కొచ్చి వలంటీరు పింఛన్ అందించేవారు. ఇప్పుడు ఎన్నికలను బూచిగా చూపించి చంద్రబాబు కల్పించిన ఆటంకంతో లబ్ధిదారులకు పింఛన్ కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. గత ఐదేళ్ల వెనక ఉన్న కష్టాలు మళ్లీ ఎదురయ్యాయి. ఈ ఐదేళ్లలో లేని కష్టం ఇప్పుడు చంద్రబాబు వల్ల పడుతున్నామని పింఛన్‌దారులు మండిపడుతున్నారు.

తూర్పు నియోజకవర్గంలో బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేస్తామని లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ముందుగా సచివాలయాలకు లబ్ధిదారులు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. పండుటాకులు ఎండలో మగ్గిపోయారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు గుంపులుగా సచివాలయాలకు అతి కష్టమ్మీద చేరుకున్నారు. అన్ని వార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆరిలోవ, డెయిరీఫారం, విశాలాక్షినగర్, వెంకోజీపాలెం, ఇసుకతోట, మద్దిలపాలెం, పెదవాల్తేరు, అప్పుఘర్, జాలరిపేట, జోడుగుళ్లపాలెం వరకు అన్ని ప్రాంతాల సచివాలయాల్లోనూ పింఛన్లు అందజేశారు.

తప్పని పడిగాపులు

సాధారణంగా ఒకటో తేదీన ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చే వలంటీర్లు లేకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. రెండు రోజుల పాటు చూసిన తర్వాత సచివాలయాలలో ఇస్తారని చెప్పడంతో బుధవారం ఉదయం నుంచి పలువురు తిరగడం ప్రారంభించారు. ఆఖరికి మధ్యాహ్నం 12 గంటల నుంచి సచివాలయం వద్ద పడిగాపులు కాశారు. సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టారు. కొన్ని చోట్ల మధ్యాహ్నం ఒంటి గంట, రెండు గంటల వరకు సచివాలయ సిబ్బంది నగదు తీసుకుని రాకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. పలువురి లబ్ధిదారులకు తమకు పింఛన్ ఇచ్చే సచివాలయం ఎక్కడుందో తెలియక తికమకపడ్డారు. వేలిముద్రలు పడని వృద్ధుల ఐరిస్ తీసుకుని పింఛన్ డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో మరింత ఆలస్యమైంది. గంటల తరబడి వేచి ఉండలేక చంద్రబాబు పుణ్యమా అంటూ ఈ ఖర్మ దాపురించిందని శాపనార్థాలు పెట్టుకుంటూ ఇంటికెళ్లిపోయారు. వలంటీర్లు ఇచ్చినప్పుడు ఐరిస్ తీయడానికి కూడా ఐదు నిమిషాలే పట్టేదని, ఇప్పుడు రోజంతా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పెన్షన్ కోసం ఎదురుచూపులు

ఏయూ క్యాంపస్: ఇంటికి వచ్చి తలుపుతట్టి చేతిలో పెట్టే పెన్షన్ సకాలంలో చేతికందలేదు. సచివాలయానికి వెళ్లి తీసుకోవాలనే నిబంధన దివ్యాంగులకు ప్రతిబంధకంగా మారింది. ఈస్ట్ పాయింట్ కాలనీలో నివాసం ఉంటున్న అంజిరెడ్డి బుధవారం పెన్షన్ కోసం సచివాలయానికి వెళ్లారు. జనాలు ఎక్కువగా ఉండడంతో వేచిచూసి అక్కడి నుంచి వెనుతిరిగారు. అటుగా వెళుతున్న వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మితో తన సమస్యను విన్నవించుకున్నారు. వలంటీర్లపై చంద్రబాబు పెట్టుకున్న కక్ష కారణంగా పెన్షన్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



సచివాలయం నుంచి తిరిగి వెళ్లిపోతున్న దివ్యాంగుడితో మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మి

కళ్లకు ఫొటో తీయాలట..



నేను ఉదయమే సచివాలయానికి వచ్చాను. ఇక్కడ ఎవ్వరూ లేకపోతే ఇంటికి వెళ్లి మళ్లీ 2 గంటలకు వచ్చాను. వచ్చి రెండు గంటలైంది. ఇప్పుడు కళ్లకు ఫొటో పడటం లేదని చెప్పారు. కొంతసేపు ఆగమన్నారు. ఎంత వరకు ఆగాలో తెలియడంలేదు. చక్కగా ఇంటి దగ్గరకు వచ్చి వలంటీర్లు డబ్బులు ఇచ్చేవాడు. ఇప్పుడు ఇంత వయసులో నన్ను తిప్పుతున్నారు. మాలాంటి ముసలోళ్లను ఇబ్బంది పెట్టడం తగదు.

– కర్రి బుల్లమ్మ, ఎస్‌కేఎంఎల్ నగర్,

అవ్వాతాతలకు పెద్ద కొడుకులా జగన్ భరోసా

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 9వ వార్డులో 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం' సభ



సిద్ధం సభకు హాజరైన ప్రజలు



సిద్ధం సభలో ఫ్యాన్ గుర్తు చూపిస్తూ మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: పింఛన్లు అందజేసి ఇంటికి పెద్ద కొడుకులా జగనన్న అవ్వాతాతలను ఆదుకున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం'సభ కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలు, జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో పెత్తందార్లతో యుద్ధానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 9వ వార్డులో కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గానికి ఏమీ చేయలేదని ఆరోపించారు. కేవలం రాజకీయ కుతంత్రంతో వలంటీర్లను ఆపేయాలని చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వలంటీర్లను ఇప్పుడు రాకుండా చేశారన్నారు. దీంతో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ప్రజలు గమనించి వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్లాటినం ఆభరణాలకు డిమాండ్

బీచ్ రోడ్డు: దేశ వ్యాప్తంగా ప్లాటినం ఆభరణాలకు డిమాండ్ పెరుగుతుందని ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ ఇండియా ఎండీ వైశాలి బెనర్జీ అన్నారు. ఈ మేరకు నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం విలేకరులతో వైశాలీ మాట్లాడుతూ డిమాండ్‌కు తగ్గట్టుగా అన్ని రిటైల్ భాగస్వాములతో కలిసి అడుగులు వేస్తున్నామన్నారు. రాబోయే పండగలు, ఉత్సవాలకు ఈ భాగస్వామ్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రిటైల్ భాగస్వాములు అనంతపద్మనాభన్, రాజేష్ కల్యాణరామన్, జాయ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సత్యవతి, తదితరులు

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ 17వ వార్డు ఆదర్శ నగర్‌లో ఇంటింటి ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లా సత్యవతి ఆధ్వర్యంలో పలువురు స్థానిక మహిళలు ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించడంతో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాలనపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ స్థానిక ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వసతి గృహంలో పనులు ప్రారంభం



టాయిలెట్స్ బ్లాక్‌లో మరమ్మతు పనులు పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ శంకరరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతిగృహంలో అవసరమైన మరమ్మతులు చేపట్టారు. మంగళవారం రాత్రి స్వయంగా హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా సిబ్బంది పరిశీలించారు. సత్వరం చేపట్టాల్సిన పనులను ప్రణాళిక సిద్ధం చేసుకుని, బుధవారం ఉదయం యూనివర్సిటీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావు సిబ్బందితో వెళ్లి అవసరమైన పనులపై వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం టాయిలెట్స్ బ్లాక్‌లో కుళాయిలు, సింక్‌లు, ఫ్లష్ ట్యాంక్‌లు కొత్తవి ఏర్పాటు చేశారు. తరచూ నీటి పైపులు పాడవకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. వీటితో పాటు బాత్ రూంలలో షవర్లను ఏర్పాటు చేశారు. టాయిలెట్స్‌లో విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి అవసరమైన అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటికే అన్ని హాస్టల్స్‌లో టాయిలెట్స్‌ని మార్పు చేయడం, గదులను ఆధునికీకరించడం వంటి పనులను ప్రారంభించారు. తాజాగా మేరీ క్యూరీ హాస్టల్ భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టారు.

సచివాలయాన్ని సందర్శించిన ఏడీసీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చిన్నఅక్కిరెడ్డిపాలెం సచివాలయాన్ని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ బుధవారం సందర్శించారు. సచివాలయ పరిధిలో పింఛన్లు ఎన్ని ఉన్నాయి, పంపిణీకి ఎంత నగదు అందింది, పింఛన్ల పంపిణీకి తీసుకుంటున్న జాగ్రత్తలపై అడ్మిన్ రేఖ, వెల్ఫేర్ సెక్రటరీ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఏడీసీ వెంట గాజువాక జెడ్సీ సన్యాసినాయుడు, ఏపీడీ ఎల్.రాము ఉన్నారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1147వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్‌ను సందర్శించిన ఈఎన్‌సీ చీఫ్



షిప్‌యార్డ్‌లో చేపట్టిన పలు ప్రాజెక్టులను వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాడింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ బుధవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా షిప్‌యార్డ్‌లో జరుగుతున్న విస్తరణ పనులతో పాటు భవిష్యత్తు ఓడ నిర్మాణ ప్రాజెక్టులు, వాటి మరమ్మతులు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను షిప్‌యార్డ్ అధికారులు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరించారు. అనంతరం ఇండియన్ నేవీ కోసం నిర్మిస్తున్న డైవింగ్ సోర్ట్ వెసెల్‌ను కూడా సందర్శించారు.

ఏఆర్‌సీకి ఎలుగుబంటి తరలింపు

ఆరిలోవ: శ్రీకాకుళం జిల్లా అడవుల్లో సంచరిస్తూ అటవీ అధికారులకు చిక్కిన ఎలుగుబంటిని విశాఖ జంతు పునరావాస కేంద్రాని(ఏఆర్‌సీ)కి తరలించారు. జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా అడవుల నుంచి మంగళవారం ఉదయం జనారణ్యంలోకి వచ్చిన ఓ ఎలుగుబంటి వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలో పాడుబడిన ఇంట్లోకి చేరింది. శ్రీకాకుళం అటవీ డివిజన్ అధికారులు, విశాఖ జూ రెస్క్యూ టీం సమన్వయంతో దాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. జూ వైద్యులు ఆ ఎలుగుబంటికి అక్కడే ప్రాథమిక పరీక్షలు చేసి శరీరంపై కొన్నిచోట్ల గాయాలున్నట్లు గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు విశాఖలో ఏఆర్‌సీకి తీసుకొచ్చారు. ఎలుగుబంటికి శారీరక, మానసిక ఆరోగ్యం కోసం తగిన చికిత్స, ఆహారం అందిస్తున్నారు.

11వ వార్డులో వెలగపూడికి 'వర్గ పోటు'

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడికి రోజురోజుకూ సంకట పరిస్థితి ఎదురవుతోంది. ఏ వార్డుకు వెళ్లినా కార్యకర్తలు ముఖం చాటేస్తున్నారు. 2019 వరకు టీడీపీకి పట్టుకొమ్మగా ఉండే ఆరిలోవ ప్రాంతంలో ఇప్పుడు బీటలు మొదలయ్యాయి. నియోజకవర్గంలో మిగిలినవాటి మాదిరిగా ఆరిలోవ ప్రాంతంలో జీవీఎంసీ 11వ వార్డులో కూడా వర్గపోరు తప్పడం లేదు. 2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ టికెట్ ఆశించిన ఆ పార్టీ నాయకులకు ఆశాభంగం ఎదురైంది. పార్టీలో ఉన్నవారికి ఎవరికో ఒకరికి కార్పొరేటర్ టికెట్ వస్తుందని ఆశించిన వారికి ఎమ్మెల్యే నిరాశపరిచారు. అప్పటికప్పుడు వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన రాగతి అచ్యుతరావు భార్యకు టికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి ఈ వార్డులో టీడీపీలో గ్రూపులు ఏర్పడ్డాయి. రాగతి అచ్యుతరావుతో పాటు ముగడ రాజారావు, మోది అప్పారావు వర్గాలుగా విడిపోయారు. 2021 కార్పొరేటర్ ఎన్నికల్లో రాగతి అచ్యుతరావు భార్య వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రస్తుత నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతిలో సుమారు 6,000 ఓట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయారు. ఈ ఓటమికి వార్డులో గ్రూపులే కారణమని, ఎమ్మెల్యే వాటిని సర్దిచెప్పలేకపోయారంటూ రాగతి అచ్యుతరావు అప్పటి నుంచి అంతృప్తితో ఉన్నారు. ఏళ్ల తరబడి టీడీపీలో ఉంటే కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా వేరే పార్టీ నుంచి వచ్చినవారికి టిక్కెట్ ఇచ్చారంటూ మిగిలిన గ్రూపుల నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. దీంతో వార్డులో ఎమ్మెల్యే ప్రచారానికి వెళ్తే అన్ని గ్రూపుల నాయకులూ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో అందుబాటులో ఉన్న నలుగురు, ఐదుగురు కార్యకర్తలతో అప్పుడప్పుడు వెలగపూడి వార్డులో ప్రచారం చేస్తూ మమ అనాల్సిన పరిస్థితి నెలకొంది. వర్గ పోరుతో నాకు ఓటమి తప్పేటట్టులేదని లోలోపల వెలగపూడి మదనపడుతున్నారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. మరో వైపు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇతర పార్టీల నుంచి వస్తున్న నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించి వైఎస్సార్‌సీపీలో చేర్చుకొని బలాన్ని రెట్టింపు చేసుకుపోతున్నారు. దీంతో వెలగపూడికి ఏం పాలుపోవడం లేదని టీడీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

జోరుగా.. హుషారుగా..



హెల్త్ ఎరీనాలో మహిళా వాకర్స్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

- ప్రజలతో మమేకమవుతూ ప్రచారంలో దూసుకుపోతున్న ఎంపీ ఎంవీవీ
- పలు పార్కుల్లో వాకర్స్‌తో మాటామంతి
- వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలపాలంటూ విజ్ఞప్తి



17వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలతో మమేమకవుతూ గత ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనను ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా బుధవారం ఉదయం ఎంవీవీ పలు పార్కులతో పాటు బీచ్ రోడ్డులో వాకర్స్‌తో మమేకమయ్యారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని హెల్త్ ఎరీనా, తెన్నేటి పార్కుల్లో వాకర్స్‌ను పలకరిస్తూ జగనన్న పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, 18వ వార్డు నాయకుడు వాసుపల్లి ఎల్లాజీ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో విస్తృత ప్రచారం

విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం బుధవారం 17వ వార్డులో జోరుగా కొనసాగింది. ఇందులో భాగంగా ఎంవీవీ 17వ వార్డు సెక్టార్-4లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, ప్రేమ్‌కుమార్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన తప్పనిసరి



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట : పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహన కలిగి ఉండాలని, కింది స్థాయి సిబ్బందికి తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ ఎన్నికల సిబ్బందితో బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం, శిక్షణ సదస్సులు తదితర అంశాలపై కింది స్థాయి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గురువారం జరిగే తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం ఆయా నియోజకవర్గాలకు సిబ్బందిని కేటాయిస్తారని, దాని ప్రకారం శిక్షణ సదస్సుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 10, 11వ తేదీల్లో తొలి విడత శిక్షణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మే నెల 5వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కును వినియోగించుకుంటారని, ఆ క్రమంలో ఇప్పటి నుంచే ప్రణాళికల కోసం సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మొదటి విడత ర్యాండమైజేషన్

మహారాణిపేట: ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ అధికారులకు గురువారం మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. వీరందరికీ మొదటి విడత శిక్షణను ఈ నెల 10 నుంచి నిర్వహిస్తామన్నారు. ఏ ఉద్యోగికీ ఇందులో మినహాయింపు లేదని.. ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

నియోజకవర్గం	శిక్షణ కేంద్రం	శిక్షణ తేదీ
భీమిలి	ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, సంగివలస	10, 12
విశాఖ తూర్పు	ఏయూ సివిల్ ఇంజనీరింగ్ క్లాస్ రూమ్	10,12
విశాఖ దక్షిణ	ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, జైల్‌రోడ్	10
విశాఖ ఉత్తర	ఏయూ మెయిన్ ఇంజనీరింగ్ బ్లాక్	10,12
విశాఖ పశ్చిమ	ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్లాక్	10,12
గాజువాక	టీఎస్సార్ అండ్ టీబీకే డిగ్రీ కాలేజీ, శ్రీనగర్, గాజువాక	10,12
పెందుర్తి	పెందుర్తి గవర్నమెంట్ హైస్కూల్	10,12

క్లుప్తంగా

కోదండ సీతారామాలయంలో మహా సంప్రోక్షణ



విశాలాక్షినగర్‌లో కోదండ సీతారామాలయం శిఖరంలో ఏర్పాటు చేస్తున్న మూలవిరాట్టు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ కాలనీలో కోదండ రామాలయంలో సీతారామ కల్యాణం మహోత్సవాల కోసం ఆలయ కమిటీ సభ్యులు మహా సంప్రోక్షణ కార్యక్రమం రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సూర్యనారాయణాచార్యుడు ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం వేద పండితులు పూజలు, హోమాలు చేశారు. ఆలయ శిఖరంలో మూలవిరాట్టు ఏర్పాటు చేశారు. అనంతరం బుధవారం మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. విశాలాక్షినగర్ ప్రాంతంలో పలు కాలనీల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి ప్రసాదం స్వీకరించారు.

స్వర్ణకారులను ఆదుకోవడం అభినందనీయం



బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: పెట్టుబడి లేక, సరైన పని లేక అయోమాయంలో ఉన్న స్వర్ణకారులకు బ్యాంకు ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోనల్ రుణాలు మంజూరు చేసి ఆదుకోవడం అభినందనీయమని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ముద్ర రుణాల ద్వారా స్వర్ణకారులకు ముడి బంగారం వస్తువులు తయారు చేసుకునేందుకు రుణాలను మంజూరు చేసి కుటుంబ పోషణకు బ్యాంకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మాజీ, బ్యాంకు మేనేజర్ బెవరా రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతుల కల్పన



అఖిల పక్ష నాయకులతో మాట్లాడుతున్న ఆర్‌వో, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ ఆర్‌వో, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ బుధవారం తన చాంబర్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓటు నమోదు ప్రక్రియ, పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు, ఎన్నికల కోడ్ అమలు, ఇతర అంశాలపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించామని, ఓటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలుచేపడుతున్నామని వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సెల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.